కథ

# పెద్దమ్మ

◆ చిత్తూరి కోటేశ్వరరావు, ఐ.పి.ఎస్. ◆

**అన్యమనస్కంగానే హాస్టల్‌లోకి అడుగు పెట్టింది రమాదేవి. గదిలో లైట్ వేయాలనే ఆలోచనే ఆమెకు రాలేదు. ఏదో తెలియని భయం..**

జరగరానిదేదో జరిగిపోతున్నది అనే భావన తోనే ఆమె భయకంపితురాలవుతున్నది. దుఃఖం ముంచుకొస్తున్నది. తను ఏడిస్తే నలుగురూ నవ్వి పోతారు.

భయం. పిరికితనం, నిస్సత్తువ. నిర్లిప్తత. కూజాలోని మంచి నీటిని ఒంపుకుని తాగడానికి కూడా ఓపిక లేనంతగా శక్తిహీనం అయిపోతున్నది రమాదేవి.

"ఏవిటే, చీకట్లో విందులేస్తున్నావా — లైటైనా వేసుకోలేదే" అంటూ వచ్చి స్విచ్ ఆన్ చేసింది రూమ్‌మేట్ రజని. రమాదేవిని చూస్తూనే నిశ్చేష్ట అయింది ఆమె.

రమాదేవి ముఖం జేవురించి వుంది. కళ్ళు నిప్పుకణికలుగా వున్నాయి.

రమాదేవి మానసిక సంఘర్షణకు లోనయింది. రేపు తను ఆసుపత్రికి ఎలా...

"మేమంతా సినిమాకు వెడుతున్నామే. వస్తావా రావా?" నిర్లిప్తంగా అడిగింది రజని.

తల అడ్డంగా తిప్పింది రమాదేవి. ఆమె అసలు ఈ లోకంలోనే వున్నట్టు లేదు!

అవును. రమాదేవికి నిజంగానే ప్రశాంతత ఎప్పుడో కరువయింది. మానసికంగా చిత్రవధకు గురవుతున్నది. తెల్లారితే తను ఎదుర్కోవలసిన పరిస్థితి.

అది జనరల్ హాస్పిటల్. సైకియాట్రి వార్డు.

హౌస్ సర్జన్ రమాదేవి బరువుగా భారంగా అడుగులు వేస్తున్నది. ఆందోళనగా ప్రొఫెసరు రంగనాధరావు, కొందరు హౌస్ సర్జన్లు అప్పటికే ఆ వార్డులో వరుసగా మెల్లగా కదులుతున్నారు. ఒక్కొక్క బెడ్ మీది పేషెంట్‌ను, కేసును వివరిస్తూ ముందుకు మెల్లిగా నడుస్తున్నాడు ప్రొఫెసరు. అనుసరిస్తున్నారు హౌస్ సర్జన్లు. వారిలో క్యూరియాసిటీ!

బెడ్ నంబరు 13.

ప్రొఫెసరు ఆగిపోయాడు. ఆసక్తిగా చూశారు హౌస్ సర్జన్‌లు.

బెడ్ మీద స్త్రీమూర్తి. వయసు నాలుగు పదులు వుండవచ్చు. ముఖాన ముత్యమంత బొట్టు. వర్చస్సు ఆమె ఒక ఉన్నతవంశ సంజాత అని చెప్పకనే చెబుతున్నది. అయితే కనులలో అలసట, నుదుటన నిర్వేదం. ఆ కనులు ఎవరికోసమో వెదుకుతున్నాయి.

ప్రొఫెసరు రంగనాధరావు బెడ్‌కు తగిలించి వున్న కేస్ షీట్‌ను అందుకుని చూశాడు. "వెల్ ప్రోగ్రెసింగ్!" అంటూ భుజాలు ఎగురవేసి, కేస్ షీట్‌ను యధాస్థానంలో వుంచాడు. ఆ పేషెంట్ గురించి స్టూడెంట్స్‌కు వివరించడం ప్రారంభించాడు ప్రొఫెసరు.

"ఈ పేషెంట్ పేరు రాజ్యలక్ష్మి. యూనివర్శిటీ రీడరు! ఒక వ్యక్తితో అక్రమ సంబంధం పెట్టుకుని ఆ వ్యక్తినే హత్యచేసిన కారణంగా జుడిషియల్ కస్టడిలో వుంచారు. అక్కడే మతిభ్రమించింది. ఇటువంటి కేసులు చాలా అరుదు..."

"నో— నో!" గుండె రగిలిన మండిపాటు.

రాజ్యలక్ష్మి అరుపుతో వార్డు దద్దరిల్లింది. ఆసుపత్రి గుభేలుమంది.

హౌస్ సర్జన్‌లు ఉలిక్కిపడ్డారు. ప్రొఫెసరు అవాక్కయాడు. పేషెంట్లు లేచి కూర్చున్నారు.

"ఈమెకు సెడేషన్ ఇవ్వండి!" ప్రొఫెసరు అటెండెంట్స్‌కు సూచించాడు.

డ్యూటీ డాక్టరు కేకతో వార్డు బాయ్‌లు పరుగున వచ్చారు. దడదడలాడారు.

ఆమెను గొలుసులతో బంధించారు. కసిగా బంధించారు.

ఆమె అరుస్తూనే వుంది. అదుపు చేయలేకపోతున్నారు. ఇంజక్షన్‌ను విసిరికొట్టింది.

అంతా చూస్తూనే వున్న రమాదేవి ప్లాను

◆ ◆ ◆

**రమాదేవికి ప్రశాంతత ఎప్పుడో కరు వయింది.**

◆ ◆ ◆

వయింది. కనులు విట్లిన వేదన. ఆవేదన.

రమాదేవి పెనుగులాటతో నర్సులు ఆమెకు ఇంజక్షన్ వేయలేకపోతున్నారు. ఆమె కన్నీరు ఏరు వై పారుతున్నది. కాళ్ళూ చేతులూ గీరుకుపోయి నెత్తురు కారుతోంది.

రమాదేవి తట్టుకోలేకపోయింది. ఒక్క ఉదుటన ముందుకు వచ్చింది. డ్యూటీ డాక్టరు, నర్సులు, బాయ్ లు ఆమెను వెనక్కు లాగడానికి విఫల యత్నం వేశారు.

రమాదేవిని చూస్తూనే రాజ్యలక్ష్మి వేష్టలుడిగి నిలువు గుడ్లు వేసింది. ధారాపాత వేడి కన్నీరు చెక్కిళ్ళను తడిపివేస్తున్నది. నీరవ నిశ్శబ్దం.... మూగ వేదన..

ఇదే అదనుగా సిస్టర్ ఇంజెక్షన్ వేసేసింది.

అందరూ తెల్లబోయి చూస్తుండగానే ఆమె మగతలోకి జారుకున్నది.

హౌస్ సర్జన్ రమాదేవిని చూడగానే అంతటి పేషెంటూ ఎందుకని అలా మౌనముదూకితురాలయిందో ఎవరికీ అర్థం కాలేదు. అదొక వింత అనుభూతి!

రమాదేవి గుండెలవిసిపోయాయి. గబుక్కున వెనుదిరిగింది.

★★★★

అది_మెడికల్ కాలేజీ లేడీస్ హాస్టలు. మేలుకున్న మూకుమ్మడి చలనం.

రమాదేవి — రాజ్యలక్ష్మి గురించే అందరూ [illegible]కుంటున్నారు. విలువలు పలువలుగా చెప్పుకుంటున్నారు. వాళ్ళిద్దరికీ సంబంధం ఏమిటి? మొత్తానికి ఏదో వుంది!

రమాదేవికి పరిస్థితి అగమ్యగోచరంగా వుంది. ప్రతి ఒక్కడూ ఆమెను అదోలా చూస్తున్నారు. ఏ క్షణాన ఎవరు వచ్చి తనను ఏమని అడుగుతారో...!

తన మనసుకు తను సర్దిచెప్పుకోలేకపోతున్నది రమాదేవి. గతం — వర్తమానం — భవిష్యత్ — సంఘర్షణలు మయం! ఘటనాఘటనల విలయం.

సభ్య సమాజానికి దూరంగా ఎటు కదలక తన గదిలోనే తను బందీగా ఒంటరిగా చీకటిలో వుండిపోతున్నది రమాదేవి. భయం.... బ్రతుకు భయం.... పెరవారి భయం...

ఒంటరిగా చీకటిలో చీకటిలో ఒంటరిగా.

తన ఏకాకితనం తననే భయపెడుతుండగా మానసిక వత్తిడిని మరి భరించలేక సీసాడు గార్డినల్ టాబ్లెట్స్‌ను గుప్పిటలోకి పోసుకున్నది రమాదేవి.

అయితే, చావు ఒక్కటే సమస్యకు పరిష్కారమా? ఆత్మహత్య ఖచ్చితంగా పిరికితనమే. పలాయనమే! చచ్చి సాధించేది ఏమిటి? నో... బ్రతకాలి... బ్రతికించాలి.

టాబ్లెట్లను సీసాలోకి పోసేసి దాచేసింది.

అయితే... ఎలా బ్రతకాలి? ఈ మనుషులు తన మానాన తనను బ్రతకనివ్వడం లేదే...

''ఏమిటే! నీ చూపులో ఏదో వింత పవరుందట? నిన్ను చూసీ చూడగానే ఆవిడెవరికో పిచ్చి



కుదిరిందటా? నన్ను కూడా ఒక్కసారి ఒక్క చూపు చూడవే. బలాదూరు తిరక్కుండా బుద్ధిగా గదిలో పడుండి చదువుకుంటాను'' గలగల వాగేస్తున్నది గదిలోకి వచ్చిన రజని. అయోమయంగా చూసింది రమాదేవి. అంతా అంతేనా.

''కొంప మునిగిపోయినట్టు ఏదో పోగొట్టుకున్నట్టు ఎప్పుడూ అదోలా వుంటావేమిటి? నీ ముఖంలో ఒక్కసారైనా నవ్వు కనిపించిందా అసలు? ఎప్పుడు చూసినా అంత సీరియస్‌గా వుంటావేమిటి? నాకు తెలియక అడుగుతాను — ఏమిటే నీ బాధ? ఆ బాధకు కారణం ఏమిటి? నిన్నెవరేమైనా అంటున్నారా? ప్రత్యక్షంగాగాని, పరోక్షంగాగాని ఎవరైనా బాధపెడుతున్నారా? నీ మనసులో బాధ మనసులోనే వుంచుకుంటే మాకెలా తెలుస్తుందే? చెప్పవే — నాకు చేతనైన సాయం చేస్తాను! అసలు నువ్వు హాస్టల్ లో ఎందుకుంటున్నావు? నీకోసం — నిన్ను పలకరించడం కోసం ఏనాడూ ఒక్కరూ రారేమిటి?'' దిగులుగా బాధగా అడిగింది రజని. సహృదయంతో సానుభూతిగా అడిగిం ది. సభ్యతగా సంస్కారయుతంగా అడిగింది.

రజని అనునయంతో రమాదేవికి దుఃఖం ఒక్కసారిగా కట్టలు తెంచుకుంది. వెక్కి వెక్కి కుమిలి కుమిలి ఏడ్చేసింది.

ఆమెను సముదాయించలేక రజనికి కూడా ఏడ్పువచ్చేసింది.

''నిన్ను కష్టపెట్టి వుంటే క్షమించవే — ఇంకెప్పుడూ అడగను. ప్లీజ్'' గాద్గదికంగా అన్నది రజని. అంత అల్లరి పిల్లలోను ఒక్కసారిగా ఆరిందాతనం చోటుచేసుకుంది.



సంఘటనలు, సన్నివేశాలు మనుషులను ఆశ్చర్యకరంగా మార్చివేస్తాయ్ !

రమాదేవి తెప్పరిల్లింది. తనను తను ఊరడించుకుంది. దుఃఖాన్ని దిగమింగుకుంది.

''అదేమీ లేదు రజనీ! నా పరిస్థితి నాకే అర్థం కావడం లేదు. అనుకోని అవాంతరస్థితిలో, వేరు గత్యంతరం లేక హాస్టల్ లో చేరాను. నాకు మనశ్శాంతి లేదు. గతం వెన్నంటి తరుముతున్నది. వెన్నులో దడపుట్టిస్తున్నది. చెబుతాను రజనీ చెబుతాను''.

తన పమిట చెంగుతో చెంపలమీది కన్నీటి చారికలను చెరిపి వేసుకున్నది. ఆత్మస్థైర్యాన్ని చిక్కబట్టుకున్నది. మనో నిబ్బరాన్ని అలవరుచు

## గొప్పనటుడు 'షమ్మీ'



'షమ్మీకపూర్' గొప్ప నటుడే కాదు నిర్మాతల కష్టసుఖాలను అర్థం చేసుకోవడంలో కూడా గొప్పవాడేనట! ఈనాటి నటీనటులు నిర్మాతలను రకరకాలుగా కమాండ్ చేస్తూ పాడి ఆవులా ఉపయోగించుకుంటూవుంటారు. కానీ 'షమ్మీ' ఆ రోజుల్లో ఇలా ఉండేవాడు కాదు. తాను అవుట్ డోర్ షూటింగ్‌కి వెళ్తే నిర్మాతల మీద ఆధారపడకుండా తనతో సొంత డబ్బును లక్షదాకా తీసుకెళ్ళి ఖర్చుపెట్టేవాడట! డబ్బు కారణం వల్ల షూటింగ్ ఆపుకోవాల్సి వస్తే తాను నిర్మాతను ఆదుకునేవాడు. అందుకే వారు మహా నటులు కాగలిగారు.

---

కుంది రమాదేవి.

"ఒక పిచ్చి దానిగా ముద్రపడి ఆసుపత్రిలో నరకయాతనలను అనుభవిస్తున్న రాజ్యలక్ష్మి ఎవరో కాదు. స్వయానా నా పెదతల్లి. త్యాగమయి. ఆమె త్యాగం వర్ణనాతీతం! మా పెద్దమ్మ అక్కడ అలా కష్టాలను అనుభవిస్తుంటే ఇక్కడ నేను ఎలా సుఖపడగలను? ఒకవైపున ఒంటరితనం. మరొకవైపున అందరినీ పోగొట్టుకున్నాననే బెంగ. సతమతమైపోతున్నానుకో...! నా బాధ ఇతరులతో చెప్పుకోలేనిది. అలా అని నన్ను నేను సంబాళించుకోలేక పోతున్నాను..."

రజని మరల సముదాయించవలసి వచ్చింది. ఈసారి మౌనంగా, మూగగా...

"పుడుతూనే తండ్రిని పోగొట్టుకున్నాను. ఊహ తెలిసేటప్పటికి తల్లి గతించింది. అమ్మమ్మ పెంచింది. ఆమె కూడా పోయింది. పెద్దమ్మ చేరదీసింది. ఈమె... ఇప్పుడు ఆసుపత్రిలో" మరల బావురుమంది రమాదేవి.

"నావంటి అదృష్టహీన్, దౌర్భాగ్యురాలు ఈ ప్రపంచంలో ఇంకెవ్వరూ లేరు లేరు..." నెత్తి బాదుకుంది రమాదేవి. "అనాధను... అక్కు పచ్చిని..."

"రమా....రమా....రమా... ఊరుకో... ఊరుకోవే! నీలో ఇంత బాధ గూడుకట్టుకుని వున్నదని నిజంగా నాకు తెలియదు. నీ మనసును కష్టపెట్టాను" అంది రజని అంటూనే ఆమె కన్నీటిని తుడిచింది. పాపిడి సవరించింది.

"రమా! నువ్వు అనాధవు కాదు రమా! మేమంతా వున్నాము. నీ కష్టాలను పంచుకుంటాం. అధైర్యపడకు. ముందు పెద్దమ్మను రక్షించుకుందాం. అందుకు మార్గాలను ఆలోచిద్దాం!" ధైర్యం చెప్పింది రజని భుజం తట్టింది.

మనసులోని వ్యధను బాధను బయటకు చెప్పుకోవడంతో రమాదేవికి కొంత భారం దిగినట్టు అనిపించింది. తేలికగా ఊపిరి పీల్చుకుంది. ఉపశమనం కలిగింది.

పెద్దమ్మను దక్కించుకోవడం ఎలా? ఇదీ ఆమె ప్రస్తుత ప్రశ్న.

చివరకు, గుండె దిటవు పరచుకుంది. స్థిర నిర్ణయానికి వచ్చింది రమాదేవి.

రమాదేవి మరునాటి ఉదయానే ఆసుపత్రికి వెళ్ళింది. పెద్దమ్మ రాజ్యలక్ష్మిని చాటుగా చూసింది. ఆసుపత్రి సూపరింటెండ్‌ంట్‌ను కలుసుకుని మట్లాడింది. మెడికల్ కాలేజీకి వెళ్లింది. ప్రిన్సిపాల్‌కు ఒక కవరును అందజేసింది.

అక్కడి నుంచి సరాసరి న్యాయమూర్తి ఇంటికి వెళ్ళింది రమాదేవి...

★★★★

"మా అమ్మమ్మ గారిది అసలు పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు. ఉపాధ్యాయవృత్తి రీత్యా చిన్నప్పుడు గ్రామానికి వచ్చారు. అప్పటికి ఆమె తల్లిదండ్రులెవరో ఆమెకు తెలియదు. పెంచి పెద్ద చేసిన వెంకటరాజుగారినే తండ్రిగా భావించింది. చినవిప్పర్రులో మోతుబరి రైతు రాఘవ రాజుగారికి ద్వితీయ కళత్రంగా మా అమ్మమ్మను పెళ్ళి గుళ్ళో నిరాడంబరంగా జరిగింది. ఆమె సంతానం మా పెద్దమ్మ రాజ్యలక్ష్మి, మా అమ్మ.

మా అమ్మకు చదువు అబ్బలేదు. పదునాలుగవ ఏటనే వివాహం చేసేశారు. మా పెద్దమ్మ తను వివాహం చేసుకోనని, పెద్ద చదువులు చదువుతానని పట్టుపట్టింది.

ఆమె చదువు నిమిత్తమే మేమంతా రాజమండ్రికి వచ్చేశాం. నేను పుట్టిన తరవాత, మా నాన్నగారు గోదావరిలో స్నానానికి వెళ్ళి, ప్రమాదవశాత్తు మునిగి చనిపోయారు. ఆ బెంగతోనే మా అమ్మ కన్ను మూసింది. మా అమ్మమ్మ, పెద్దమ్మే నన్ను కంటికి రెప్పలా పెంచి పెద్ద చేశారు. మూడేళ్ళ క్రితం మా అమ్మమ్మ కాలధర్మం చెందింది.

మా పెద్దమ్మ నాగార్జున యూనివర్శిటీ రీడర్ అయారు. గుంటూరు అరండల్ పేటలో ఇల్లు తీసుకుని వుంటున్నాం. నేను గుంటూరు మెడికల్ కాలేజీలో మెడికో పూర్తి చేసి హౌస్ సర్జన్ చేస్తున్నాను. మా తాతగారు మాకు దూరంగా వున్నా, మా అమ్మమ్మ గారి పేర వెలలేని ఆస్తిపాస్తులను వ్రాశారు. అవన్నీ మావే. పెళ్ళి చేసుకోమని పెద్దలు ఎంతగా చెప్పినా మా పెద్దమ్మ వినలేదు. నా భవిష్యత్తు మీదే దృష్టిని కేంద్రీకరించి బ్రహ్మచారిణిగానే వుండిపోయింది.

మా పెద్దమ్మకు రాఘవరాజుగారు, ఏలూరు రాజుగారు, రాజారాంగారు ఇంకెవరూ తెలి

◆◆◆

**సీసాడు గార్డినల్ టాబ్లెట్స్‌ను గుప్పిటలోకి తీసుకున్నది ఆమె.**

◆◆◆

యుదు. రాజారాం ఎల్.ఐ.సి డెవలప్‌మెంట్ ఆఫీసరుగా పనిచేస్తున్నారు. వారి కుటుంబ విషయాలు నాకు అంతగా తెలియవు. వారిది కూడా నిడదవోలు గ్రామమేనట. మా పెద్దమ్మతో పాటే చదువుకున్నారట. ఆ చనువుతోనే ఆయన తరచు మా ఇంటికి వస్తుండేవారు. నేను అంకుల్ అనేదాన్ని. ఆయనకు చదరంగం ఇష్టం. నాకూ నేర్పాడు.

ఆ రోజున...

క్లాసులు లేకపోవడంతో, మధ్యాహ్నమే ఇంటికి వచ్చేశాను.

రాజారాంగారు కూడా అనుకోకుండా అదే వేళకు ఇంటికి వచ్చారు. పెద్దమ్మ యూనివర్శిటీ నుంచి రాలేదు. ఉభయులం పిచ్చాపాటీ మాట్లాడుతూ కూర్చున్నాం.

హఠాత్తుగా నా చేయి పట్టుకుని తన మీదికి లాక్కున్నాడు రాజారాం. ఊహించని దుస్సాహసానికి నిర్ఘాంతపోయాను. బయటకు పారిపోవడానికి ప్రయత్నించాను. బలంగా సోఫా మీదకు తోసి మీద పడ్డాడు. నా రెండు చేతులను వెనక్కు విరిచి పట్టుకుని ముద్దాడబోయాడు. ఎంత పెనుగులాడుతున్నా విడవక ఏదో చేసేస్తున్నాడు. నా శక్తి చాలడం లేదు.

"రాజారాం — రమను వదులు!" గుమ్మంలో పెద్దమ్మ గర్జన వినిపించి త్రుళ్ళిపడ్డాను. పట్టు సడలింది. నేను బైట పడ్డాను. కిందకు పరుగెత్తుకు వచ్చాను.

ఇంతలో పై గదిలో పెద్ద శబ్దమయింది. నాకు భయం వేసింది. ఆ దుర్మార్గుడు పెద్దమ్మను ఏం చేస్తున్నాడో అనుకున్నాను. మొండి ధైర్యం వచ్చింది. కంగారుగా వంటగదిలోకి వెళ్ళాను. పచ్చడి బండ కనిపించింది. అందుకున్నాను. పైకి పరుగెత్తాను. అనుకున్నట్టే — రాజారాం పెద్దమ్మను

◆ ◆ ◆

**వద్దని వారిస్తున్నా వినకుండా పోలీసులకు ఫోన్ చేసింది.**

◆ ◆ ◆

కిందపడవేసి, పెనుగులాడుతున్న ఆమె పీకను నొక్కేస్తున్నాడు. ఆ సన్నివేశం చూసీ చూడగానే ఏం చేయాలో తోచక ఆవేశంతో పచ్చడిబండ ఎత్తి రాజారాం నెత్తి మీద బలంగా ఒకే ఒక్క దెబ్బ కొట్టాను.

ఒక్క దెబ్బకే తల పచ్చడై నెత్తురు కక్కుకుంటూ అక్కడికక్కడే చచ్చి వూరుకున్నాడు రాజారాం...

పెద్దమ్మ తెప్పరిల్లింది. జరిగిన భీబత్సాన్ని చూసింది. శవాన్ని చూసింది. రొప్పుతున్న నన్ను చూసింది. నా చేతిలోని పచ్చడి బండను చూసింది. గబుక్కున దానిని లాగేసుకుని, తన చేతపట్టుకుని వద్దని వారిస్తున్నా వినకుండా పోలీసులకు ఫోన్ చేసింది. స్థాణువుగా నేను చూస్తుండగనే పోలీసులతో వెళ్ళిపోయింది పెద్దమ్మ. తనే హత్య చేసినట్టు చెప్పింది.

ఆ బాల్యంగా కష్టాలకు అలవాటు పడిన నా పెదతల్లి నన్ను రక్షించుకోడం కోసం నేను చేసిన హత్యను తను చేసినట్టు చెప్పింది. నా పెద్దమ్మ తన తల్లికోసం నా తల్లికోసం, నా కోసం తన జీవితాన్ని ధారపోసింది. అటువంటి స్త్రీ మూర్తులు ఈ ప్రపంచంలో కోటికి ఒక్కరైనా ఉండడం అరుదు.

పెద్దమ్మను చూడడానికి రెండు మూడుసార్లు జైలుకు వెళ్ళాను. కాని ఆమె నన్ను కలుసుకోవడానికి నిరాకరించింది.

నెల్రక్రితం వెళ్ళినప్పుడు ఆమెకు కొద్దిగా మతి భ్రమించినట్టు తెలుసుకున్నాను. పిచ్చి ముదురుతున్నట్టు తెలుసుకుని ఆసుపత్రిలో చేర్పించాడు.

మా పెద్దమ్మ మామూలు మనిషి కావలెనంటే — ఆమె నిర్దోషి అని ప్రపంచానికి తెలియాలి. అసలు హంతకిని నేను నేను ఏకాకిని. నేను ఏమైనా పరవాలేదు. నిర్దోషి అయిన ఆమె బ్రతకాలి. ఆమె వల్ల సమాజానికి ఉపయోగం వున్నది. నిర్దోషి శిక్ష అనుభవించడం న్యాయం కాదు.

మా తాతయ్య రాఘవరాజుగారు వచ్చారు. ఆయన దేవుడిలాంటి వ్యక్తి. మా పెద్దమ్మకు ఊరట కల్పిస్తారు. ఆయన సాన్నిధ్యంలో మా పెద్దమ్మ మరల మామూలు మనిషి అవుతుంది. ఆ తండ్రీ కూతుళ్ళు పోగొట్టుకున్న ఆప్యాయతను రాగాలను మరల పొందగలుగుతారు.

నిజమైన దోషిని నేను. పెద్దమ్మ రాజ్యలక్ష్మి నిజంగా నిర్దోషి. నా నేరాన్ని మనస్ఫూర్తిగా ఒప్పుకుంటున్నాను. ఆమెను రక్షించండి న్యాయమూర్తిగారు. మీకు దణ్ణం పెడతాను. నన్ను మానసిక క్షోభ నుంచి, మా పెద్దమ్మను హంతకి అనే అపవాదు నుంచి విముక్తి కల్పించండి న్యాయమూర్తిగారు ... మీకు దణ్ణం పెడతాను..."

కుప్పకూలి పోయింది రమాదేవి.

●



## బొంబాయికి మకాం మార్చింది

నటి 'శ్రీదేవి' తన పెట్టేబేడాని బొంబాయికి మార్చింది. ఇంతకాలం ఆమె ఎక్కువకాలం బొంబాయిలోనే వుంటున్నా మకాం మాత్రం మద్రాసులోనే వుండేది. ఆమె కోసం ఫైవ్‌స్టార్ హోటళ్ళను ఏర్పాటుచేసిన నిర్మాతల బాధలను అర్థం చేసికొందో లేక వరుసగా మూడు చిత్రాలు 'లంహే, హీర్‌రాంఝా, రూప్‌కిరాణి...' ఫ్లాప్ అయ్యాకా తను బొంబాయిలోనే పర్మినెంటుగా వుండకపోతే తనకే నష్టం అనుకుందో... మొత్తానికి జూహూలోని తన ఫ్లాట్‌లోకి మారిపోయింది.